నేడు రేషన్‌కార్డుల పంపిణీ

మేడ్చల్: నియోజకవర్గం కొత్తరేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం మంగళవారం మేడ్చల్‌లో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ భూపాల్ తెలిపారు. అత్వెల్లిలోని జీఎస్ఆర్ కన్వెన్షన్‌హాల్‌లో నిర్వహించే కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేస్తారని తెలిపారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



మేడ్చల్‌రూరల్: తల్లి పాలే బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని మెడిసిటీ ఆసుపత్రి ప్రెసిడెంట్ శివరామకృష్ణ అన్నారు. ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధి ఘనాపూర్‌లోని మెడిసిటి ఆస్పత్రి, మెడికల్ కళాశాలలో సోమవారం తల్లిపాల వారోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మెడికల్ కళాశాల విద్యార్థినులు ముగ్గుల ప్రదర్శనతో పాటు వైద్య విద్యార్థులు రూపొందించిన ప్రత్యేక పోస్టర్లు, పటికలు ప్రదర్శించారు. అనంతరం ఆస్పత్రిలో బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

‘ఖేలో ఇండియా’ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు ఖేలో ఇండియా పోటీల్లో సత్తాచాటారు. సంగారెడ్డి జిల్లాలో నిర్వహించి సీనియర్ ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్–25లో పాల్గొన్న కళాశాల విద్యార్థినులు పలు విభాగాల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. విద్యార్థినులు హరిణి, రమేశ్వరి, సాయివర్షిని, సౌజన్య, మహేశ్వరి సిల్వర్, బ్రౌంజ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి టీవీ.రెడ్డి, డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, పీడీ విద్యార్థులను అభినందించారు.

స్వచ్ఛతపై కమిషనర్‌కు వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

మేడ్చల్‌రూరల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధి రావల్‌కోల్ గ్రామంలో ఫాగింగ్ చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్ నిత్యానందంకు వినతి పత్రం అందజేశారు. గ్రామం మున్సిపల్‌గా మారిన నాటి నుంచి గ్రామంలో ఫాగింగ్ చేయలేదని, వర్షాకాలం సందర్భంగా బ్లీచింగ్ చల్లడం లేదని వివరించారు. సీపీఎం మండల కార్యదర్శి నరేష్, నాయకులు కొమురయ్య, హకీం, మణితేజ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యలపై సమావేశం

కీసర: నేడు నాగారంలో కీసర డివిజన్ విద్యుత్ ఆఫీస్ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతుందని విద్యుత్ డీఈ లింగయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మంగళవారం ఉదయం 10.30 నాగారం మున్సిపల్ పరిధిలో కీసర డివిజన్ విద్యుత్ ఆఫీస్ ఆవరణలో నిర్వహించే విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో తరచూ వచ్చే అంతరాయాలు, విద్యుత్ హెచ్చుతగ్గుల సమస్యలు, విద్యుత్ మీటర్ సమస్యలు, విద్యుత్ బిల్లులలోని సమస్యలు, కొత్త సర్వీసులు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, తదితర సమస్యలను పరిష్కరించేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందన్నారు.

‘ప్రజావాణి’లో ఫిర్యాదుల వెల్లువ

- 91 సమస్యలపై ఫిర్యాదులు
- ప్రజలకు నమ్మకాన్ని పెంచాలి
- కలెక్టర్ మనుచౌదరి



సాక్షి, మేడ్చల్ జిల్లా: కలెక్టరేట్ ప్రజావాణిలో సమస్యలపై ఫిర్యాదు చేస్తే.. పరిష్కారం కాగలవన్న గంపెడాశ తో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని వివిధ పురపాలక సంఘాల్లోని కాలనీలు, బస్తీలు,మారుమూల ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తున్నారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజలు 91 ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరికి అందజేశారు. గతంలో పరిష్కారం కాని సమస్యలు కలెక్టర్ పరిష్కరించగలరన్న ధీమాతో వినతులను రాత పూర్వకంగా అందించారు.

పురపాలక సంఘాల నుంచే అధికం

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 16 పురపాలక సంఘాలు, జీహెచ్ఎంసీ పరిధిలోని 10 మున్సిపల్ సర్కిళ్ల పరిధి నుంచి ప్రజావాణికి 17 ఫిర్యాదులు, కలెక్టరేట్ రెవెన్యూ విభాగంలోని వివిధ సెక్షన్లలో ఎదురయ్యే సమస్యలపై 19 వరకు ఫిర్యాదులు అందాయి. సంక్షేమ శాఖలకు సంబంధించి 6, జిల్లా గృహనిర్మాణ శాఖకు 10, కాప్రా మున్సిపల్ సర్కిల్ నుంచి 8 ఫిర్యాదులకు సంబంధించిన దరఖాస్తులు జిల్లా కలెక్టర్‌కు వచ్చాయి. నాగారం మున్సిపాలిటీ నుంచి 6 ఫిర్యాదులు వచ్చాయి. జవహర్‌నగర్, పీర్జాదిగూడ కార్పొరేషన్లతో సహా మేడ్చల్, కొంపెల్లి మున్సిపాలిటీల పరిధిలో కొనసాగుతున్న అక్రమ కట్టడాలు, అవినీతి, అక్రమాలు, భూకబ్జాలపై కూడా ఫిర్యాదులు వచ్చాయి. మల్కాజిగిరి, కీసర ఆర్డీఓ పరిధికి సంబంధించి 8 ఫిర్యాదులు వచ్చాయి. పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణపై కూడా వినతులు అందాయి.

ప్రజలకు నమ్మకాన్ని పెంచాలి

– జిల్లా కలెక్టర్ మనుచౌదరి

ప్రజలు అందజేసే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించటం ద్వారా ప్రజావాణిపై ప్రజల్లో విశ్వాసం పెంచాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి తెలిపారు. జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చి సమస్యలు పరిష్కారం కాగలవన్న నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తున్నారన్న విషయాన్ని మరిచిపోవద్దని ఆయన సూచించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. తిరస్కరించే దరఖాస్తుల సమాచారాన్ని సంబంధిత కారణాలతో వారికి తెలుపాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల సొసైటీ డివిడెండ్లను వెంటనే చెల్లించాలి



అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని మహిళా (డ్వాకా) సంఘాలను కీసర స్నేహ మహిళా సొసైటీ కీసర నుంచి రావాల్సిన డివిడెండ్లను వెంటనే చెల్లించేలా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఆర్డీఏ అధికారులకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌకుట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ.. నాగారం పరిధిలోని డ్వాక్రా సంఘాలు వరకు కీసర మహిళా సొసైటీలో 2018 వరకు కొనసాగాయని, అనంతరం నాగారంలోని బ్యాంక్‌లకు తమ సంఘాలను మార్చారన్నారు. స్నేహ సొసైటీలో ఉన్న ప్రతి ఒక్క సంఘానికి సొసైటీ లాభాలను రూ. 10 వేల చొప్పున డివిడెండ్లు ఇవ్వాలని, గతంలో సొసైటీ తీర్మానం చేసింది. కానీ నాగారం, రాంపల్లిలోని సంఘాలకు ఎలాంటి డివిడెండ్లు ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు. నాగారం మున్సిపల్ పరిధిలోని డ్వాక్రా సంఘాల అభ్యర్థన మేరకు సోమవారం జిల్లా కలెక్టర్, డీఆర్డీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. బీజేపీ నేతలు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, రామక్కపేట రవీందర్‌రెడ్డి, జూపల్లి నరేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు జ్యోతిపాండే, జోరుక కృష్ణవేణి, విజయలక్ష్మి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డుల మంజూరు పత్రాలు

- నేడు మేడ్చల్‌లో ప్రారంభించనున్న ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు
- కొత్త వారికి సెప్టెంబర్‌లోనే బియ్యం

సాక్షి,మేడ్చల్ జిల్లా: కొత్తగా మంజూరైన రేషన్ కార్డులు, మ్యూటేషన్ల (చేర్పులు, మార్పులు)కు సంబంధించిన లెటర్లు (మంజూరు పత్రాలు) సంబంధిత లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు జిల్లా పౌరసరఫరాలశాఖ చర్యలు తీసుకుంటోంది. ఈనెల 5న (మంగళవారం) మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని అత్వెల్లి, జీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో కొత్త రేషన్ కార్డులు, మ్యూటేషన్లకు సంబంధించిన లెటర్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అందజేయనున్నారు.

దరఖాస్తుల పరంపర...

కొత్త రేషన్ కార్డుల కోసం జిల్లావ్యాప్తంగా పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందుతూనే ఉన్నాయి. గత రెండు నెలల్లో వందల సంఖ్యలో దరఖాస్తులు రాగా.. వీటిల్లో 7,700 కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయి. 20 వేల మంది సభ్యుల పేర్లను పాత కార్డుల్లో చేర్చారు. జిల్లాలో ఓ వైపు కార్డుల మంజూరు ప్రక్రియ కొనసాగుతుంటే... ఇంకోవైపు దరఖాస్తుల పరంపర కొనసాగుతోంది.

సెప్టెంబరులోనే పంపిణీ..

జూన్, జూలై నెలల్లో కొత్తగా రేషన్ కార్డులు అందిన వారికి, పేర్లు చేర్చిన లబ్ధ/దారులకు సెప్టెంబరులో బియ్యం కోటా మంజూరు కానుంది. ఈ విషయం తెలియక చాలామంది లబ్ధిదారులు రేషన్ దుకాణాల చుట్టూ తిరిగుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో 3 నెలలకు సంబంధించిన కోటాను జూన్‌లోనే ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ దుకాణం డీలర్లు సంబంధిత లబ్ధిదారులకు అందజేశారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



ఘట్‌కేసర్ ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ మను చౌదరి

ఘట్‌కేసర్: ప్రభుత్వ ఆసుపత్రిని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యులు, రోగులు, ఫార్మసిస్ట్‌లతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యసిబ్బంది మందుల గడువు తేదీని ఎప్పటికప్పుడు చూసుకోవాలని, గడువు దాటిన మందులు ఒక్కరికి ఇచ్చిన వందమంది రోగులకు చేసిన వృథా అవుతుందన్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా.. ల్యాబరేటరీలో రోజుకు ఎన్ని పరీక్షలు చేస్తున్నారా.. అన్నీ పరీక్షలు చేస్తున్నారా.. లేని పరీక్షలు ఎక్కడ చేయిస్తున్నారని ప్రశ్నించారు. ఎక్స్‌రే విభాగం, ఫోటోగ్రఫీ మిషన్‌ను పరిశీలించారు.

ఓపీ పేషెంట్ల రిజిస్ట్రేషన్‌పై..

వైద్యానికి అవసరమైన పరికరాల మరమ్మతులకు ఎస్టిమేషన్ వేసి పంపాలని వైద్యాధికారికి కలెక్టర్ సూచించారు. ఓపీ పేషెంట్ల రిజిస్ట్రేషన్ అప్‌డేట్‌పై ఆరా తీశారు. రోగులకు అందుతున్న వైద్యం, సిబ్బంది హాజరు పట్టిక, ఓపీ రిజిస్టర్, డెలివరీలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం వైద్యశాఖను బలోపేతం చేయడానికి కృషి చేస్తుందన్నారు. దీనికి అనుగుణంగా వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని, వాటి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని, మెరుగైన వైద్యసేవలు అందించి ఆదర్శంగా ఆదర్శంగా నిలువాలన్నారు. ఆసుపత్రి వైద్యాధికారి లింగంమూర్తి, తహసీల్దార్ రజని, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఫుడ్ సెఫ్టీ ప్రమాణాలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాలునాయక్

మేడ్చల్‌రూరల్: ప్రతి ఒక్కరూ ఫుడ్ సెఫ్టీ ప్రమాణాలు పాటించాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఎస్ఆర్వో డైరెక్టర్ బాలునాయక్ అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఆధ్వర్యంలో సోమవారం స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులు, స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వీధి వ్యాపారి ఆహార భద్రత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు వ్యాపారులకు భద్రతపై అవగాహన పెంచి, రాష్ట్రంలో ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు దోహదపడతాయని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న వారికి ఫుడ్ సెఫ్టీ ఇండియా ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించి శిక్షణ కిట్లు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఏఎఫ్‌సీ ఖలీల్, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ధర్మేంద్రపాల్, రిటైర్డ్ డీఎఫ్‌సీ విజయ్‌కుమార్, అధికారులు, మహిళా సంఘాలు పాల్గొన్నాయి.



‘స్వాధ్యాయ’ శతాబ్ది ఉత్సవాలు

మేడ్చల్‌రూరల్: స్వాధ్యాయ పరివార శతాబ్ది ఉత్సవాలు మేడ్చల్‌లో నిర్వహించారు. పట్టణంలోని జంగ లక్ష్మయ్య ఫంక్షన్‌హాల్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో పాండురంగశాస్త్రి- నిర్మల దంపతులు పాల్గొని భగవద్గీత విచారాల ద్వారా ప్రజలు జీవిత విలువలను తెలుసుకుని అందుకు అనుగుణంగా జీవిస్తారని తెలిపారు. మనిషి తనకు తాను తెలుసుకుని జీవించడమే స్వాధ్యాయ ఉద్దేశమని వివరించారు. స్వాధ్యాయ పరివార సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల సాధనకు 13న మహాగర్జన



జవహర్‌నగర్: ప్రజాపాలనలో పెన్షన్‌దారుల కష్టాలు తీరడం లేదని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోనార్‌దుర్గాప్రసాద్ అన్నారు. ఈ మేరకు జవహర్‌నగర్‌లో దివ్యాంగులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడస్తున్నా.. దివ్యాంగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఎన్నికలకు ముందు రూ.6వేల పెన్షన్ దివ్యాంగులకు అందిస్తామని హామీ ఇచ్చి, ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. దివ్యాంగుల హక్కుల సాధనకు ఈనెల 13న హైదరాబాద్‌లో నిర్వహించే మహాగర్జన సభను విజయంతం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ వినియోగదారులకు నేడు ప్రత్యేక కోర్టు

ఘట్‌కేసర్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి నాగారం మున్సిపాలిటీ శిల్పానగర్‌లోని కీసర డివిజన్ కార్యాలయం ఆవరణలో నేడు ప్రత్యేక కోర్టు నిర్వహించనున్నట్లు ఘట్‌కేసర్ ఏఈ యశ్వంత్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం, హెచ్చుతగ్గు సమస్యలు, మీటర్, బిల్లు సమస్యలు, కొత్త సర్వీసులు ఇవ్వకపోవడం, సేవల్లో జాప్యం, పేరు, సర్వీస్ క్యాటగిరి మార్పుపై వినియోగదారులు ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు.

పల్లె దవాఖానా ప్రారంభం

శామీర్‌పేట్: ఓ దాత సహకారంతో పల్లె దవాఖానాను సుందరంగా తీర్చిదిద్ది ప్రజలకు సేవలు అందించడానికి అందుబాటులోకి వచ్చిందని మూడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్ పవణ్‌కుమార్ అన్నారు. సోమవారం మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధి, జగ్గంగూడలో వల్లె దవాఖానాను ఆయన ప్రారంభించారు. పల్లె దవాఖానాకు కావాల్సిన మౌలిక వసతులను సమకూర్చిన పారిశ్రామికవేత్త విశ్వ కంపెనీ యజమాని ఎర్ర నర్సింగరావుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ వీరాస్వామి, జంగారెడ్డి, అనిల్‌రెడ్డి, నాగరాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, జహంగీర్, వైద్యులు పాల్గొన్నారు.

పలహారం బండి ఊరేగింపు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో టీపీసీసీ ఎస్సీసెల్ కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పలహార బండి ఊరేగింపు వైభవంగా జరిగింది. ముఖ్యఅతిథిగా ఆలేరు నియోజకవర్గ శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపును ప్రారంభించారు. పోతరాజుల విన్యాసాలు, కోలాట నృత్యాలు, డప్పుల దరువులతో ఊరేగింపు ఆద్యంతం ఉత్సాహంగా సాగింది.

ఆర్థికసాయం

ఘట్‌కేసర్: థైరాయిడ్ క్యాన్సర్‌తో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేదకు ఎన్ఎఫ్‌సీనగర్ సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అండగా నిలిచారు. నగరానికి చెందిన రాయపల్లి లక్ష్మీకామేశ్వరీ థైరాయిడ్ క్యాన్సర్‌తో రెండేళ్లుగా చికిత్స పొందుతుండగా.. పరిస్థితి విషమించడంతో సర్జరీ జరిగింది. పేద కుటుంబం కావడంతో బాధితురాలి భర్త భాస్కర్ రావు విజ్ఞప్తి మేరకు ఎన్ఎఫ్‌సీనగర్ సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు రూ. 20వేల చెక్కును సోమవారం అందజేశారు. ట్రస్ట్ సభ్యులు భాస్కర్‌రావు, సుందర్‌రావు, శ్రీకాంత్, ఐలయ్య, ఆల్వ వీరారెడ్డి, బంగారుబాబు, రామయ్య, కృష్ణ, మల్లయ్య పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు

శామీర్‌పేట్: అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి హెచ్చరించారు. సోమవారం తూంకుంట మున్సిపాలిటిలో 3 అక్రమ నిర్మాణాలను గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ జ్యోతి మాట్లాడుతూ.. అక్రమ కట్టడాలకు నోటీసులు జారీ చేసినా పనులు నిలిపేయలేదని, టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలను సంబంధిత వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో కలిసి సీజ్ చేసినట్లు వివరించారు.

భారత్‌లో పురోగతి సంస్థ ‘సాల్వో’



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న హెచ్ఈఎంఆర్ఎల్ ప్రతినిధులు

కీసర: అధునాతన ఉత్పత్తుల శ్రేణి, భద్రతా ప్రమాణాలు, నాణ్యత నియంత్రణలో సాల్వో ఎక్స్‌ప్లోసివ్స్, కెమికల్స్, ప్రైవేట్ లిమిటెడ్‌ను భారత్‌లో పురోగతి సంస్థగా విశ్వసనీయంగా నిలబెడుతున్నాయని, హెచ్ఈఎంఆర్ఎల్ డైరెక్టర్ డా.ఏపీ దాస్ అన్నారు. సోమవారం అంకిరెడ్డిపల్లిలో డీఆర్‌డీఎల్ ఏఎస్ఎల్ ఎక్స్‌ప్లోసివ్స్ సంస్థ సహకారంతో రాకెట్ మోటార్స్‌లో వాడే కంపోసిటివ్ ప్రొఫెల్లెంట్ ప్రోడక్ట్ తయారుచేసే ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. దేశ రక్షణరంగం డీఆర్డీఓ సహకారంతో 10 రకాల ఉత్పత్తులలో ప్రత్యేక నైపుణ్యాన్ని కలిగి సాంకేతిక మద్దతుతో పరిశోధన, అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని కీలక రక్షణ ప్రాజెక్టులలో భాగస్వామ్యం కావాలన్నారు. అనంతరం సాల్వో చైర్మన్ జయరాంరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డితో ప్రతినిధుల బృందం ఒప్పందం చేసుకుంది.

కీసర ఆలయంలో గంధాభిషేకం



కీసర: శ్రావణమాసోత్సవాల ప్రత్యేకపూజల్లో భాగంగా రెండో సోమవారం దశమి సందర్భంగా కీసరగుట్ట భవానీరామలింగేశ్వర స్వామికి అర్చకులు కనుల పండువగా గంధాభిషేకం చేశారు. ఉదయం గర్భాలయంలో కొలువైన స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం పూజ అనంతరం గంధాభిషేకం పూజ నిర్వహించారు. స్వామిదర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో కీసరగుట్టకు తరలివచ్చారు. ఆలయ చైర్మన్ తటాకం నారాయణ, ఈఓ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన



కీసర: వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా దమ్మాయిగూడ మున్సిపల్ 10వ వార్డు దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం ఇంటింటికి వెళ్లి తడి,పొడి వ్యర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణ, వన మహోత్సవంలో భాగంగా మొక్కలు పంపిణీ చేశారు. స్పెషల్ ఆఫీసర్, పుష్పలత, కమిషనర్ వెంకట్‌రెడ్డి, డీఈఈ బాలమురళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, వార్డు ఆఫీసర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రెండీగా రెయిన్ సూట్స్ !

- ద్విచక్ర వాహనదారులకు రక్షణగా..
- చిన్నారులు, స్కూల్ విద్యార్థులకు అధిక ప్రయోజనకరం

మేడ్చల్‌రూరల్: వర్షాకాలం ఇల్లు వదిలి బయటకు వెళితే ఏ క్షణం వర్షంలో తడుస్తామో తెలియదు. ఈ క్రమంలో అలంకార ప్రియులకు ఈ పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటుంది. తడవకుండా కాపాడడంతో పాటు రక్షణకు రెయిన్‌కోట్లు, మాన్‌సూట్లు ఉపయోగపడతాయి. వీటికి అన్ని వర్గాల వారి నుంచి మంచి క్రేజ్ ఉంది.

వెరైటీ డిజైన్లలో ఉండే మాన్సూట్స్ అన్నీ..

ముఖ్యంగా స్కూల్‌కు వెళ్లే పిల్లలు, ఆఫీసులకు వెళ్లే పెద్దలు, ఫీల్డ్‌లో ఉండే మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ తప్పనిసరిగా వర్షంలో బయటకు వెళ్తే రెయిన్‌కోట్లు వాడుతుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారికి గొడుగులను వినియోగించడం కొంత కష్టమైన పని కావడంతో లేటేస్ట్ రేయిన్ సూట్లకు ప్రాధాన్యతనిస్తున్నారు. తడవకుండా రక్షణ ఇవ్వడంతో పాటు చూసేవారికి ఆకట్టుకునే గెటప్‌లో కనిపించేలా చేస్తున్నాయి.

అందుబాటు ధరల్లో..

మేడ్చల్ పట్టణంలో మార్కెట్‌లో అందమైన మాన్సూట్స్ అన్ని వర్గాల వారికి అందుబాటు ధరల్లో ఉన్నాయి. రెయిన్ ప్యాంట్, షర్ట్, జాకెట్, లాంగ్ జాకెట్, టూ ఇన్ వన్ జాకెట్, లెదర్ జాకెట్ వంటివి వ్యాపారులు విక్రయిస్తున్నారు. బ్రాండెడ్ లో రూ. వేయి నుంచి అందుబాటులో ఉండగా.. అన్ బ్రాండెడ్‌లో రూ.200 నుంచి రూ.1,000 లోపు ధరల్లో ఉన్నాయి.

వాహనాలపై సౌకర్యవంతం

వర్షాకాలంలో వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారందరూ రెయిన్‌కోట్లు వేసుకోవాల్సిందే. వాహనాలపై వెళ్లడానికి గొడుగు కంటే మాన్‌సూట్స్ సౌకర్యవంతంగా ఉంటాయి. బ్రాండెడ్ సూట్స్ చూడటానికి ఆకట్టుకోవడంతో పాటు మన్నికగా ఉంటాయి. చాలా రకాల మోడల్స్‌లో లభిస్తున్నాయి.

– ప్రవీణ్, పూడూర్

యువత ఎక్కువగా ఇష్టపడుతున్నారు.

స్టైలిష్‌గా ఉండే బ్రాండెడ్ మాన్‌సూట్లను యువత ఎక్కువగా ఇష్టపడుతున్నారు. కస్టమర్లు ఎక్కువగా మెచ్చే మోడల్స్‌ను అందుబాటులో ఉంచాం.

– దయాకర్, షాపు యజమాని



వివిధ బ్రాండ్లలో అందుబాటులో ఉన్న రెయిన్‌సూట్స్

నేటి నుంచి వేంకటేశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాలు





ఆనంద్‌బాగ్ లక్ష్మీ వేంకటేశ్వర ఆలయం, స్వామి వారి మూలవిరాట్

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం 5 నుంచి 9వ తేదీ వరకు జరగనున్నాయని ఈవో రవీందర్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు ముడుంబై వేంకటరమణాచార్యులు ప్రకటించారు. నేడు కోయిల్ అళ్వార్ తిరుమంజనం, సాయంత్రం విశ్వక్సేన ఆరాధన, ధ్వజపటాదవాసం, చివరి రోజు 9న ఉత్సవాంత స్నపనం, అరవణి కైంకర్యం, శ్రీనివాస గద్యంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వివరించారు.